




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 59 | పేజీలు : 8 | గురువారం 26 ఫిబ్రవరి 2026 | వెల : 4/-


## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి కానీ



- ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్
- ఎప్‌స్టీన్‌స్‌తో సంబంధాలు ఉండటంపై క్షమాపణలు చెప్పిన బిల్‌గేట్స్
- ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టీకరణ

2



ఎడిటర్
నరేంద్ర

రాజకీయాలు కులాల దారిలో... వ్యవస్థ కూడా అదే దారిలో నడుస్తుందా? అరెస్టు నుంచి విమర్శ వరకూ ప్రతిదీ కులపు గీతలోనేనా? బ్యూరోక్రసీ కూడా కుల కార్డులు ఆడితే సమాజం ఎటు పోతుంది?

# కులాల చుట్టూ తిరుగుతున్న పాలన



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఇప్పుడు కుల రాజకీయాలకు వేదికగా మారుతున్నాయా అన్న ప్రశ్నకు ఇటీవలి పరిణామాలు బలమిస్తున్నాయి. ఒక రాజకీయ నాయకుడిపై చర్యలు తీసుకుంటే అది తప్పు--సరైన అంశంగా కాకుండా కుల కోణంలోకి మళ్లడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాదు, ఇప్పుడు అదే ధోరణి ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల మాటల్లోనూ కనిపిస్తుండడం మరింత ప్రమాదకర సంకేతం. చట్టం, వ్యవస్థ, బాధ్యత అన్న పదాల స్థానంలో కులం ముందుకు వస్తే ప్రజాస్వామ్యానికి అది ముప్పు. రాజకీయాలకే పరిమితం కావాల్సిన కుల మత్తు, వ్యవస్థను నడిపే స్థాయికి చేరడం సమాజం ఆగి ఆలోచించాల్సిన పరిస్థితిని తెచ్చింది.

## చేనేతకు 'అసెంబ్లీ' ఆదరణ

బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రత్యేక స్టాళ్లు
స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభం -- మంత్రులు, ఎమ్మెల్యేల కొనుగోళ్లు
నేతన్నల్లో ఆనందం

అమరావతిలో జరుగుతున్న ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభిస్తోంది. స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ముందుండి చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడంతో అమ్మకాలు పెరుగుతున్నాయి. ఈ చర్యలతో రాష్ట్రంలోని నేతన్నల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.



## కల్తీ పాల కలకలం యాంటీడోట్ సిద్ధం

రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు
రాజమహేంద్రవరంలో ఇంటింటి సర్వేలో కొత్త కేసులు లేవు
150 నమూనాలు సేకరణ -- నాణ్యతలేని పాలు పారబోత
వారం రోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక డ్రైవ్



రాజమహేంద్రవరంలో వెలుగుచూసిన కల్తీ పాల ఘటనపై జిల్లా యంత్రాంగం, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయ్యాయి. అవసరమైన యాంటీడోట్ ఇంజెక్షన్లు ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తుండగా, ఇంటింటి సర్వేలో కొత్త కేసులు నమోదు కాలేదని అధికారులు వెల్లడించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు ప్రారంభమయ్యాయి. కలుషిత పాలు కారణంగా వైద్య సహాయం అవసరమయ్యే రోగులకు అవసరమైన యాంటీడోట్ ఇంజెక్షన్ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ డా. రవి రాజు సూచనల మేరకు రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఈ ఇంజెక్షన్ వినియోగించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో - మిగతా 2లో




## దేశానికే వ్యూహాత్మక ఖనిజాల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతోందని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాల ఆధారంగా మైనింగ్ నుంచి తయారీ వరకు పూర్తి స్థాయి విలువ ఆధారిత వ్యవస్థను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు.

## వెలిగొండతో జలకళ...

మార్కాపురానికి అభివృద్ధి భరోసా
రూ.456 కోట్ల ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన
మార్కాపురం జిల్లా తొలి పర్యటనలో సీఎం చంద్రబాబు కీలక ప్రకటనలు



మార్కాపురం జిల్లా అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసిన ఆయన, మార్కాపురం జిల్లాను నీరు, ఉద్యాన పంటలతో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

3

# కల్తీ పాల కలకలం: యాంటీడోట్ సిద్ధం

-మొదటిపేజీ తరువాయి
లేకపోవడంతో సంబంధిత ఏజెన్సీల ద్వారా ప్రత్యేకంగా తెప్పిస్తున్నట్లు వివరించారు.

**ఇంటింటి పర్యవేక్షణ ఫలితాలు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆర్ఎంసీ కమిషనర్ రాహుల్ మీనా పర్యవేక్షణలో 9 వైద్య బృందాలు పాల్గొని 110 కుటుంబాలు, 307 మందిని పరిశీలించాయి. లాక్ చేసిన 6 ఇళ్లను ఫోన్ ద్వారా సంప్రదించగా ఎటువంటి లక్షణాలు లేవని నిర్ధారించారు. నేటి సర్వేలో కొత్త కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. కుటుంబాలకు కలుషిత పాలు, పాల ఉత్పత్తులను వినియోగించకుండా సురక్షితంగా పారవేయాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు గమనిస్తే మెడికల్ క్యాంప్‌ను లేదా 94940 60060 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని కలెక్టర్ వెల్లడించారు.

**రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు.**

రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రత్యేక తనిఖీలు ప్రారంభమయ్యాయి. సుమారు 150 పాల నమూనాలు సేకరించి హైదరాబాద్, చెన్నై, కాకినాడలోని గుర్తింపు పొందిన ప్రయోగశాలలకు పరీక్షల కోసం పంపించారు. అనంతపురంలో రెండు చోట్ల కలిపి సుమారు 100 లీటర్ల నాణ్యతలేని పాలను పారబోశారు. ఒక



కేంద్రంలో 30 లీటర్లు పాడైపోయిన పాలు, మరోచోట 70 లీటర్ల నాణ్యతలోపం ఉన్న పాలు గుర్తించారు. మచిలీపట్టణంలో 20 లీటర్ల బాదం పాలలో లోపాలు బయటపడ్డాయి. కాకినాడలో 5 కిలోల మిల్క్ పౌడర్ సీజ్ చేశారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ పాలలో యూరియా, పిండి పదార్థాలు, వెజిటేబుల్ ఆయిల్ కల్తీని గుర్తించేందుకు ప్రత్యేక 'మ్యాజిక్ కిట్లు', లాక్టోమీటర్లు ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ కిట్లు రాష్ట్రంలోని 28 జిల్లాలకు పంపించినట్లు చెప్పారు. తనిఖీలు మరో వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. పాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# చేనేతకు 'అసెంబ్లీ' ఆదరణ

రక్షణ న్యూస్ అమరావతి

అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో చేనేత వస్త్రాల అమ్మకాల పెంపుదలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ స్టాళ్లను ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ప్రసిద్ధ చేనేత ఉత్పత్తులను అక్కడ ప్రదర్శనతో పాటు అమ్మకానికి ఉంచారు. ప్రారంభం నాటి నుంచి ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్‌లు స్టాళ్లను సందర్శిస్తూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్వయంగా స్టాళ్లను పర్యవేక్షిస్తూ తోటి ప్రజాప్రతినిధులను చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు ప్రోత్సహిస్తున్నారు. బుధవారం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులు స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా...**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు షర్టు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు చీరలు, సాధారణ చీరలు వంటి విభిన్న రకాల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. రెడీమేడ్ దుస్తులు కూడా కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. అసెంబ్లీ విధుల్లో



పాల్గొంటున్న ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది సైతం స్టాళ్లలో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం విశేషంగా నిలిచింది. అసెంబ్లీలో లభిస్తున్న ఈ ఆదరణతో ఆయా జిల్లాల నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి సవితతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. చేనేతకు అసెంబ్లీ వేదికగా లభిస్తున్న ఈ ప్రోత్సాహం అమ్మకాల పెరుగుదలతో పాటు నేతన్నల జీవనోపాధికి ఊతమిస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇటుక ధరలు ప్రియం...
# ట్రక్కు రూ.20వేలకు పైగా ధరలు

**ఖమ్మం :** ఇటుక ధరలు అకాశానంటుతున్నాయి.. ప్రజల అవసరాలను అసరాగా చేసుకున్న ఇటుక వ్యాపారులు ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు.. క్రీస్తూ శకం.. క్రీస్తూ పూర్వం అన్నట్లుగా ఇందిరమ్మ ఇళ్లు రాక ముందు... ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత అన్నట్లుగా బట్టీ వ్యాపారులు ధరలను కొండెక్కించారు. పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందనంత ఎత్తుకు ఆ ధరలు పెరిగిపోయాయి.. ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత ఇటుక ధరలు మూడు రెట్లు పెరిగినట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇండ్లు కట్టుకోవాలనుకునే నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు బెంబెలేత్తుతున్నారు. ప్రతి ఇళ్లు నిర్మాణం చేయాలంటే ఇటుక చాలా అవసరం.. అందులో ఎర్ర ఇటుక లేకుండా ఏ ఇళ్లు కట్టలేము.. ఆ ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేస్తేనే గట్టిదనం ఉంటుందని అందరు భావిస్తుంటారు. అయితే ఏ సైజు ఇళ్లు నిర్మాణం చేయాలన్న కనీసం 10వేల ఇటుక అవసరం అవుతుంది.. సింగిల్ బెడ్ రూమ్ కు సుమారు 10వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇంటికి 15వేల నుంచి 20వేల ఇటుక అవసరం. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ఎర్ర ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేయాలని భావిస్తారు. అందుకే ఇంటి నిర్మాణం చేసేవారు ముందుగా ఇటుక ను కొనుగోలు చేసేందుకు తొందరపడతారు. ఎర్ర ఇటుక ధరలు ఏడాదికేడాది అమాంతంగా పెరుగుతున్నాయి.. 2005 సంవత్సరంలో 2వేల ఇటుక ధర రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ధర పలికేది. 2010 తరువాత రూ.4వేల నుంచి రూ.5వేలకు పలికేది. 2015 నుంచి 2024 వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకముందు ట్రక్కు ఎర్ర ఇటుక రూ.5వేల నుంచి రూ.7వేల వరకు ధరలుండేవి. కానీ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం, గ్రామానికి 20 నుంచి 30 ఇండ్లను మంజూరు చేయడంతో లబ్ధిదారులందరికి ఇటుక అవసరమైంది. దీంతో లబ్ధిదారుల అవసరాన్ని అసరగా చేసుకున్న ఇటుక బట్టీల వ్యాపారులు ఇటుక ధరలను అమాంతంగా పెంచేశారు. 2024 డిసెంబర్ వరకు మంచి ఇటుక ట్రక్కు ఇటుక రూ.10వేలకు పెంచిన వ్యాపారులు, నెల వ్యవధిలోనే రూ.15వేలు, మరో నెలకు మరో రూ.5వేలను పెంచి ప్రస్తుతం 2వేల ఇటుక ధర రూ.20వేల



నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. రెండవ రకం ఇటుక 2వేల ఇటుక రూ.16వేల నుంచి రూ.18వేల వరకు విక్రయాలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసే నిరుపేదలకు ఇటుక ధరలు భారమవుతున్నాయి. ఒకోక్క ఇందిరమ్మ ఇంటికి చిన్ని ఇంటికి సుమారుగా 10వేల ఇటుక, కొంచె పెద్ద ఇంటికి 15వేల ఇటుక అవసరం అవుతుంది. దీంతో ఇటుకకే రూ.1,50,000 నుంచి రూ రూ.1,80,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.. దీంతో నిరుపేదలకు ఇటుక అధిక ధరలు తీవ్రంగా భారమవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగానే సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలను అమాంతంగా పెంచారని భావించి తక్షణమే ధరల నియంత్రణపై ఉపమంత్రివర్గాన్ని నియమించింది. రోజుల వ్యవధిలోనే ధరలను నియంత్రించింది. దీంతో సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలు అదుపులోకి వచ్చాయి.కానీ ఇటుక ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయే తప్ప..ఇప్పటి వరకు అదుపులోకి రాలేదు. ఇటుక ధరలను పట్టించుకునే నాథుడే కరువైయ్యారు. అధికారులు ఇటుక బట్టీల వైపు చూసే నాథుడే లేదు. దీంతో ఇటుక వ్యాపారులు అధిక ధరల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతుంది.. ప్రజలకు మాత్రం జేబులకు చిల్లు పడుతోంది.. కూసుమంచి మండలంలోని కూసు మంచి, తుర్కగూడెం, జుజ్జులరావుపేట సమీప గ్రామాల్లో ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ ఇటుక బట్టీలలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సామా న్యులు కొనలేని పరిస్థితిలో ఇటుక ధరలను వ్యాపారులు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి అతి దగ్గరలో ఇటుక బట్టీలు ఉన్నప్పటికి సంబంధిత రెవెన్యూ, పర్యావరణ, పంచాయతీ రాజ్, చిల్డన్స్ వ్పెర్ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. కనీసం ధరల నియంత్రణ పై ద్రుష్టి సారించడం లేదు. దీంతో తీవ్ర స్థాయిలో విమ్మర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇటుక బట్టీలను తనిఖీ చేసి వ్యాపారులతో చర్చించి, ధరలను నియంత్రించాలని, నిరుపేదలకు సహాయం చేయాలని పలువురు కోరుతున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా..? ఇటుక బట్టీలను తనిఖీ చేస్తారా..? చూద్దాం..

## కులాల చుట్టూ తిరుగుతున్న పాలన...

ఎడిటోరియల్ కాలం నరేంద్ర

రాజకీయాల్లో కుల ప్రభావం కొత్తది కాదు. కానీ గతంలో అది అంతర్గతంగా, అండర్‌కరెంట్‌లా ఉండేది. ఇప్పుడు మాత్రం రాజకీయ సంభాషణల మధ్య బహిరంగంగా, నిర్భయంగా ప్రవేశిస్తోంది. ఒక అరెస్టు జరిగితే నేర స్వరూపం ఏంటి, చట్ట ఉల్లంఘన ఉందా అన్న ప్రశ్నలకు బదులుగా "ఆ వ్యక్తి ఏ కులం?" అన్న ప్రశ్న ముందుకు రావడం ఈ మార్పుకు స్పష్టమైన ఉదాహరణ. ఇటీవలి కాలంలో ఒక మాజీ మంత్రి ముఖ్యమంత్రిని తీవ్ర పదజాలాలతో దూషించిన కేసులో పోలీసులు చట్టబద్ధంగా చర్యలు తీసుకున్నారు. ఈ అంశాన్ని మేధావులు, న్యాయవాదులు కూడా తప్పుబట్టారు. ఎందుకంటే ముఖ్యమంత్రి ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. ఆ వ్యవస్థను బహిరంగంగా దూషించడం రాజకీయ విమర్శ పరిధిలోకి రాదన్నది న్యాయపరంగా స్థిరమైన అభిప్రాయం. అయితే ఈ ఘటన ఇక్కడితో ఆగలేదు. నేరం, చట్టం, బాధ్యత అన్న అంశాలు పక్కకు నెట్టబడి, ఒక్కసారిగా కుల చర్చ ప్రధానంగా మారింది. "ఆ కులానికి చెందినవాడు కాబట్టే కేసులు పెట్టారు" అన్న వాదనలు వినిపించాయి. కుల సంఘాల నేతలు రంగంలోకి దిగారు. అసలు నేరం ఏంటి? చేసిన మాటలు ఏ స్థాయిలో ఉన్నాయి? అన్న చర్చలు మరుగునపడ్డాయి. ఇది రాజకీయ వర్గాలతోనే పరిమితం కాలేదు. ఇదే ధోరణి ఇప్పుడు ఉన్నతాధికారుల మాటల్లోనూ కనిపించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఐపీఎస్ స్థాయి అధికారి ఒకరు తనపై జరుగుతున్న విచారణను కుల కోణంలో చూపించేందుకు ప్రయత్నించడం రాజకీయంగా మాత్రమే కాకుండా వ్యవస్థపరంగా కూడా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. చట్టం ముందు అందరూ సమానులే అన్న రాజ్యాంగ సూత్రం ఉన్నప్పటికీ, ఒక అధికారి కూడా తన చర్యలపై జరిగే విచారణను "కుల వేధింపులు"గా అభివర్ణిస్తే, అది వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రయత్నంగానే భావించాల్సి వస్తుంది. చట్టపరంగా అధికారులు విధి నిర్వహణలో భాగంగా విచారణకు లోబడతారు. అది వ్యక్తిగత గౌరవానికి వ్యతిరేకం కాదు. కానీ ఆ ప్రక్రియను కుల కవచంలో చుట్టేస్తే, నేరం చేసినవాడు కూడా "నాకు అన్యాయం" అంటూ బయటపడే ప్రమాదం ఉంటుంది. ఈ ధోరణి కొనసాగితే, రేపు ఒక సామాన్యుడిపై కేసు పెట్టినా అదే వాదన వినిపిస్తుంది. ఒక అధికారిపై చర్యలు తీసుకున్నా అదే నినాదం మోగుతుంది. అప్పుడు చట్టం మాట్లాడాల్సిన చోట కులాలు మాట్లాడతాయి.

ఇది కుల వ్యతిరేకత కాదు. కులాన్ని రాజకీయ, పరిపాలనా ఆయుధంగా మార్చడంపై హెచ్చరిక. రాజకీయ లాభాల కోసం కులాన్ని రెచ్చగొడుతున్నామా? లేక చట్టాన్ని కాపాడుతున్నామా? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వని పరిస్థితి రాష్ట్రాన్ని మరింత ప్రమాదకర దిశలోకి నెట్టే అవకాశముంది. వ్యవస్థలకే కుల రంగు పూస్తే, ప్రజాస్వామ్యానికి మిగిలేది నినాదాలే తప్ప న్యాయం కాదు....

## వెలిగొండతో జలకళ...

మార్కాపురం రక్షణ న్యూస్



నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి పర్యటన ఉత్సాహంగా సాగింది. దోర్నాల మండలం గంటవానిపల్లిలో రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం, అనంతరం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండివీరారెడ్డి అనే రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు నమూనాను పరిశీలించిన అనంతరం అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వెలిగొండ టన్నెళ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడిన సీఎం, ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షించాలని ఇరిగేషన్ మంత్రికి ఆదేశించారు. వెలిగొండ పూర్తితో గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరితో పాటు ఉదయగిరి, కడప, బద్వేల్ ప్రాంతాలకు కూడా సాగునీరు అందుతుందని చెప్పారు. మొత్తం 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని వెల్లడించారు. మార్కాపురంలో జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గత పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, పునర్నిర్మాణం కోసం ప్రజల మద్దతుతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ప్రజలు ఘన విజయం అందించారని ధన్యవాదాలు తెలిపారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ప్రత్యర్థులకు ఒక్క సీటు కూడా రాకపోవడం ప్రజల తీర్పేనన్నారు. వెలిగొండ ప్రాజెక్టును తానే శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దాన్ని పూర్తిచేసే అవకాశం కూడా తనకే వచ్చిందని సీఎం పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.5,451 కోట్లు ఖర్చు చేశామని, భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు వెచ్చించామని తెలిపారు. ఇంకా రూ.2,540 కోట్లు అవసరమని చెప్పారు. రెండు దశల్లో వెలిగొండను పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించామని, గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగవంతం చేశామని తెలిపారు. ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్‌ను పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టును 2027 గోదావరి పుష్కరాల లోపు పూర్తిచేస్తామని చెప్పారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమానంగా ఖర్చు చేస్తున్నామని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా రూ.34 వేల కోట్లు, అన్నదాత సుఖీభవ, దీపం 2.0, తల్లికి వందనం వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని తెలిపారు. మార్కాపురం జిల్లాను ఉద్యాన వన పంటల కేంద్రంగా తీర్చిదిద్దుతామని, నల్లమల సాగర్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

రూ.50 కోట్లతో మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌కు నూతన భవనం, భూ రికార్డుల ప్రక్షాళన, క్యూఆర్ కోడ్‌తో భద్రతాయుత పాస్‌పుస్తకాల జారీ వంటి చర్యలు చేపట్టామని చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానంతో స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. చివరిగా సీఎం మాట్లాడుతూ, "చెత్త రాజకీయాలు కాదు... అభివృద్ధి రాజకీయాలే కావాలి. వెలిగొండను పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా. మార్కాపురం జిల్లా అభివృద్ధే నా బాధ్యత" అని స్పష్టం చేశారు.

## దేశానికే వ్యూహాత్మక ఖనిజాల హబ్‌గా ఆంధ్రప్రదేశ్...

రక్షణ న్యూస్ అమరావతి




నోవాటెల్ హోటల్‌లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ సాండ్ ఖనిజాల వర్క్ షాప్‌లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం దేశానికే వ్యూహాత్మక ఖనిజాల నిలయమని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి మచిలీపట్నం వరకు విస్తరించిన తీరప్రాంతంలో టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఖనిజాల వెలికితీతకే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, తుది ఉత్పత్తుల తయారీ వరకు విలువ పెంపు గొలుసులను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. బీచ్ సాండ్ ఖనిజాలు క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్ష రంగాలకు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

గతంలో గనుల రంగంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని, ఖనిజ బ్లాకుల వేలాలు, సింగిల్ విండో అనుమతులు, పెట్టుబడులకు అనుకూల విధానాలతో రాష్ట్రంలో పరిశ్రమలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

